జమ్మిచెరువు పార్కుకు కొత్త శోభ

- రూ.42 లక్షలతో అభివృద్ధి పనులు
- సందర్శకులకు మెరుగైన సదుపాయాలు



చెరువు చుట్టూ రక్షణగా ఏర్పాటు చేసిన కంచె



పార్కులో కొత్తగా సిద్ధం చేసిన వాకింగ్ ట్రాక్

భీమునిపట్నం: భీమిలి చిన్నబజారు సమీపంలోని జమ్మి చెరువు పార్కు అభివృద్ధి పనులు జీవీఎంసీ అధికారులు చేపట్టడంతో కొత్తశోభ సంతరించుకుంది. ఇక్కడ విశాలమైన పార్కు ఉండగా గతంలో నామమాత్రపు సదుపాయాలు ఉండడంతో సందర్శకులు, పిల్లలు ఇబ్బందులు పడేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం సదుపాయాల కల్పనకు రూ.82 లక్షలు మంజూరు చేసింది. ఇందులో భాగంగా తొలి విడత కింద రూ.42 లక్షలతో పలు పనులు చేపట్టారు. దాని ప్రకారం చెరువు చుట్టూ వాకింగ్ చేయడానికి ట్రాక్ ఏర్పాటు చేశారు. అలాగే ఇంతకు ముందు చెరువు చుట్టూ రక్షణ ఉండేది కాదు. ఇప్పుడు దాని చుట్టూ గట్టి ఇనుప కంచె ఏర్పాటు చేశారు. గతంలో పిల్లల కోసం ఉన్న ఆటల పరికరాలు బాగా తుప్పుపట్టి పాడైపోయాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయగా కొన్నింటికి మరమ్మతులు చేసి రంగులు వేశారు. అలాగే పార్కు చుట్టూ ఉన్న రక్షణ గోడ పడిపోగా కొత్తగా నిర్మించి రంగులు వేశారు. తొలి విడత పనుల వల్ల పార్కు కొత్త కళ సంతరించుకుంది. అలాగే వాకింగ్ చేసేవారికి, పిల్లలకు ఎంతో సదుపాయంగా ఉంది. ఇదేకాకుండా మరికొద్ది రోజుల్లో రెండో విడత కింద పార్కు చుట్టూ లైటింగ్‌తోపాటు రెయిన్ షెల్టర్‌లు, ఫొటో షూట్ పాయింట్‌తోపాటు మరికొన్ని సదుపాయాలు కల్పించనున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మరమ్మతుల తర్వాత పిల్లల ఆట సామగ్రి



మరమ్మతులు చేసి రంగులు వేసిన రక్షణ గోడ

నాణ్యతతో పనుల నిర్వహణ

జమ్మి చెరువు పార్కులో చేపట్టిన అభివృద్ధి పనుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోపాటు చక్కని నాణ్యతతో చేయించాం. ఇక్కడకు వస్తున్న సందర్శకులకు అవసరమైన సదుపాయాలు కల్పించాం. పిల్లలు సరదాగా ఆడుకోవడానికి అవసరమైన పరికరాలు ఏర్పాటు చేశాం.

– జి.సురేష్, పార్కుల నిర్వహణ ఏఈ

పథకాల అమలు జగనన్నతోనే సాధ్యం



మధురవాడ మెట్టపై లబ్ధిదారులకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అందించిన ప్రజారంజక పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యం అవుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయంత్రం జీవీఎంసీ 8వ వార్డు పాత మధురవాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు నివాసాల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును వివరించారు. సంక్షేమ పథకాల కరపత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయితేనే సంక్షేమ పథకాలు, వలంటీర్, సచివాలయ వ్యవస్థలు కొనసాగుతాయన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాలనీలో నివాసాల మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం వల్ల విద్యుదాఘాతానికి గురవుతున్నామని, సమస్య పరిష్కరించాలని, 296 జీవో ద్వారా ఇచ్చిన పట్టాలకు కూడా రిజిస్ట్రేషన్ చేయించాలని, చైతన్యపురి కాలనీలో పార్కు అభివృద్ధి చేయాలని కోరారు. ఇక్కడి 58 డ్వాక్రా గ్రూపులకు బ్యాంకు రుణాలు పడలేదని మహిళలు వాపోయారు. సమస్యలపై తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, 8వ వార్డు జేసీఎస్ ఇన్‌చార్జి ఉప్పులూరి గోపి, లొడగల రామ్మోహన్, చెన్నా దాసు, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ముదుండి రాజేశ్వరి, ఎమ్‌వీ రమణమూర్తి, శ్రీదేవి, లోహిత్, భాగం స్వాతి సుధాకర్, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, డీఈ శ్రీహరి, ఏఈలు శ్రీధర్, సూర్యప్రకాశ్, ఆర్ఐ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భీమిలి బీచ్‌కు క్లీనింగ్ యంత్రం



బీచ్‌లో చెత్త తొలగిస్తున్న క్లీనింగ్ యంత్రం

భీమునిపట్నం: భీమిలి పరిధిలోని బీచ్ ఇసుకలో చెత్తను తొలగించడానికి కొత్తగా బీచ్ క్లీనింగ్ యంత్రాన్ని జీవీఎంసీ అందించగా గురువారం పనులు ప్రారంభమయ్యాయి. దీంతోపాటు సాగర్‌నగర్, ఆర్‌కే బీచ్ ప్రాంతాలకు రెండు యంత్రాలు అందించారు. కాగా భీమిలి తీరం నుంచి తిమ్మాపురం వరకు రోజూ తీరంలోని చెత్తను ఈ యంత్రం తొలగిస్తుంది. పారిశుధ్య సిబ్బంది బీచ్ ఇసుకలో చెత్తను తొలగించడానికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అధికారులు ఈ యంత్రాన్ని అందించారు. ట్రాక్టర్ వెనుక తొట్టి, దానికి ఒక బ్రష్ లాంటిది ఉండగా... ఇది వెళ్తున్న ప్రాంతంలోని చెత్తను తొట్టి లోపలకు లాగేసుకుంటుంది. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ చెత్తను సేకరించడానికి వీలుంటుంది.

ఐనాడ సచివాలయం పరిశీలన



ఐనాడ సచివాలయంలో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఎంపీడీవో విజయ్ కుమార్

పద్మనాభం: మండలంలోని ఐనాడ సచివాలయాన్ని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, మూవ్‌మెంట్, ఇతర రిజిస్టర్లు తనిఖీ చేశారు. రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఇళ్ల లబ్ధిదారులకు హౌసింగ్ అకౌంట్లు

మధురవాడ: జీవీఎంసీ 5, 6, 7 వార్డుల పరిధిలో గల జగనన్న ఇళ్లకి సంబంధించిన హౌసింగ్ లబ్ధిదారులకు చంద్రంపాలెంలో గల 59వ వార్డు సచివాలయంలో శుక్రవారం బ్యాంకు అకౌంట్‌లు ఓపెన్ చేస్తారని, అంతా సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ ఏఈ సూర్యప్రకాశ్ చెప్పారు. జగనన్న ఇళ్ల నిర్మించడానికి బ్యాంకు ద్వారా రుణం పొందాల్సి ఉంటుందని, దానికి అకౌంట్ తప్పనిసరి అని చెప్పారు. ఇందుకు సంబంధించి వైజేసీ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయిన ఎన్‌పీఐ ఐడీ ఖచ్చితంగా పొందాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లను సంప్రదించాలని కోరారు.

వాయు కాలుష్యం ప్రాణాంతకం

మధురవాడ: స్థానిక మిథిలాపురి వుడా కాలనీలో గ్రీన్ క్లైమేట్ టీం సభ్యులు గురువారం మొక్కలు నాటారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జీవీరత్నం ఆధ్వర్యంలో కాలనీలో స్వచ్ఛమైన ప్రాణ వాయువు పరిరక్షణ కోసం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో 99 శాతం మంది కలుషితమైన గాలిని పీల్చుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించిందన్నారు. వాయు కాలుష్యంతో ఏటా 7 మిలియన్ల మంది మరణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ తిరునగరి సాయి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో మొక్క నాటుతున్న రత్నం



హౌసింగ్ బోర్డు కాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు

చిత్తడిగా రహదారులు

పీఎం పాలెం: ఈ ప్రాంతంలో గురువారం కురిసిన వర్షానికి రోడ్లు చిత్తడిగా మారాయి. రోడ్లపై గుంతల్లో నీరు నిలిచిపోవడంతో స్థానిక రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. గాయత్రినగర్, ఆర్‌హెచ్ కాలనీ, బాబానగర్ ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. ఉదయమే ప్రారంభమైన వర్షంతో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు.

గణపతి ఉత్సవాలకు రాట

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతపేట కుమ్మరివీధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలకు గురువారం రాట వేశారు. రామాలయం అర్చకుడు శ్రీను పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక యువకులు పోలిరాజు, సురేష్, సాయి, అప్పలరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.



కుమ్మరివీధిలో ఉత్సవ రాట వేస్తున్న స్థానికులు

గీతంలో ఓపెన్ స్కూల్ ప్రారంభం

కొమ్మాది: సైన్స్ కోర్సుల పట్ల విద్యార్థులకు ఆసక్తి పెంచడంతోపాటు పదో తరగతి, ఇంటర్ తర్వాత పరిశోధకులుగా మారాలంటే చేయాల్సిన కృషిని వివరించేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఓపెన్ స్కూల్ పేరిట ఓ కార్యక్రమం ప్రారంభించింది. నగరంలో గల పలు పాఠశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీతం ప్రో వీసీ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ దేశంలో శాస్త్ర విజ్ఞాన పరిశోధనలు పెరుగుతున్నాయని, చంద్రయాన్ వంటి ప్రయోగాలు విజయవంతం కావడం వెనుక శాస్త్రవేత్తల కృషి ఉందన్నారు. విద్యార్థి దశలోనే విజ్ఞాన శాస్త్రం పట్ల అవగాహన పెంచుకోవడం ద్వారా దేశ ప్రగతిలో యువత భాగస్వాములు కావచ్చన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న జడ్జి గంగరాజు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ముందుగా అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీవారి ప్రసాదాన్ని ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శివ అందజేశారు.



శ్రీవారి సన్నిధిలో జడ్జి గంగరాజు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తగరపువలస: భీమిలి మండలంలోని రాజాపులోవ – రాయ్‌పూర్ రహదారిలో గెద్దపేట కూడలి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పద్మనాభం మండలం చిన్నాపురం పంచాయతీ కొయ్యపేటకు చెందిన రేవళ్ల అనిల్ కుమార్ (25), అతని పెద్దమ్మ రేవళ్ల సింహాచలం (46) తీవ్రంగా గాయపడ్డారు. కూలి పనులు చేసుకునే వీరు తగరపువలస నుంచి కొయ్యపేట వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. సింహాచలం ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ తాతారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోతుల రోడ్డుతో రాకపోకలకు అవస్థలు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం రోడ్డు జగనన్న కాలనీ వద్ద గోతులు పడడంతో ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. 15 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ రోడ్డు కాలనీ వద్ద రెండేళ్లకే గోతులు పడింది. స్థానికులు తాత్కాలికంగా గోతులను మట్టితో పూడ్చుతున్నారు. ఇటుక బట్టీల లారీల రద్దీకి పూడ్చిన వారం రోజులకే మళ్లీ గోతులు పడుతున్నాయి. వర్షాల సమయంలో ఈ గోతులు మరింత పెద్దగా అవుతున్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి గోతులను బీటీతో పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.



గోతులు పడిన కృష్ణాపురం రోడ్డు

200 మందికి వైద్య పరీక్షలు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ మహారాజుపేట కూడలిలో గల ఇమ్మానుయేల్ ఫార్మసీ కళాశాలలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించారు. సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి వైద్య సిబ్బంది ఇక్కడ నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఫార్మసీ కళాశాల ప్రతినిధులు వీరికి సహాయ సహకారాలు అందించారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు



రామవరంలో కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలో విద్యార్థులు

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో రెండో రోజు శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక భక్త బృందం అఖండ హరినామ సంకీర్తన చేశారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. శ్రీ రాధాకృష్ణులు, జగన్నాథ, సుభద్ర, బలభద్ర స్వామి వార్లను పట్టు వస్త్రాలతో, వివిధ వర్ణాల పూలతో ఆకర్షణీయంగా అలంకరించారు. ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని తదితరులు శ్రీకృష్ణ లీలల ప్రవచనాలను భక్తులకు వివరించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే కాలనీలోని విజయ గణపతి ఆలయ సముదాయంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సుబ్బరాజు, నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ రుషికేశ్వరరావు, శంకరరావు, గాయత్రి, లక్ష్మి తదితరులు గోపాలునికి ప్రత్యేక పూజలు చేశారు.

- మధురవాడ నగరంపాలెం రోడ్డులోని వేంకటేశ్వర విద్యాపీఠ్‌లో వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. కరస్పాండెంట్ వై.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ వై.సంధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఈవో వినయ్‌కుమార్, డైరెక్టర్ ప్రణీత పాల్గొన్నారు.

ఆనందపురం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం పలుచోట్ల ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గంభీరంలో హరేకృష్ణ వైకుంఠం వద్ద అంబరీష దాస స్వామీజీ భక్తులకు శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా బృందావనం నుంచి వచ్చిన లడ్డూ గోపాలునికి మృదువైన ఊయలలో సేవ నిర్వహించారు. వేలాది మంది భక్తులు శ్రీకృష్ణ భగవంతుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. మండపం ఆవరణలో భక్తులు 108 సార్లు హరేకృష్ణ నామాన్ని జపించారు. సాయంత్రం ఆవరణలో ప్రఖ్యాత కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. అనంతరం కళ్లకు గంతలు కట్టి ఉట్టి కొట్టుట, కుండలు పగలగొట్టుట వంటి ఆటల పోటీలు చిన్నారులకు నిర్వహించారు. రాధాకృష్ణులను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు.

- మండలంలోని రామవరంలో గుడిలోవ విజ్ఞాన విహార్ ఆధ్వర్యంలో వివిధ కేటగిరీలలో చిన్నారులకు శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించారు. డైరెక్టర్ దూసి రామకృష్ణ కృష్ణతత్వంను వివరించారు. రవీంద్రభారతి పాఠశాలలో బాల గోకులం నిర్వహించారు.
- తగరపువలస: భీమిలి మండలంలో పలుచోట్ల యాదవ సంఘాల ప్రతినిధులు ఉట్ల ఉత్సవం నిర్వహించారు. సంతపేట గొల్లవీధిలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. తాటితూరు కూడలిలో ఏర్పాటు చేసిన మండపం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకృష్ణ భగవానుని దర్శించుకున్నారు. పాత మూలకద్దు పంచాయతీలో సీతారామాలయం వద్ద, జీవీఎంసీ రెండో వార్డు జీరుపేటలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.



తాటితూరులో శ్రీకృష్ణ మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



మధురవాడలో గోపిక, గోపాలుని వేషధారణలో విద్యార్థులు



గంభీరంలో రాధాకృష్ణులను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

స్నాతకోత్సవానికి ఏయూ ముస్తాబు



స్నాతకోత్సవానికి సిద్ధం చేస్తున్న వేదిక

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం 87,88,89,90 సంయుక్త స్నాతకోత్సవం ఈ నెల 9న జరగనుంది. దాదాపు నాలుగేళ్ల తర్వాత జరగనున్న ఈ స్నాతకోత్సవానికి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చాన్సలర్ హోదాలో హాజరుకానున్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై సుమారు మూడు గంటలకుపైగా స్నాతకోత్సవం జరగనుంది. స్నాతకోత్సవం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే కట్టమంచి రామలింగారెడ్డి స్నాతకోత్సవ మందిరాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. స్నాతకోత్సవంలో సుమారు 690 మంది డాక్టరేట్లు అందుకోనున్నారు. వీరితోపాటు బంగారు పతకాలు, ప్రైజ్‌లు సాధించిన వారు 600 మంది వరకు ఉన్నారు. దీంతో వేదికపై పట్టాలు, ప్రైజ్‌లు, మెడల్స్ తీసుకునే వారు 1,290 మందికి పైగా ఉంటారు. వీరితోపాటు వారి కుటుంబ సభ్యులు సైతం అదే సంఖ్యలో కార్యక్రమానికి హాజరవుతారు. అతిథులు, ఆహ్వానితులు కార్యక్రమంలో పాల్గొంటారు. దీనికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. కార్యక్రమం జరిగే స్నాతకోత్సవ మందిరాన్ని సరికొత్తగా తీర్చిదిద్దుతున్నారు. సభా వేదికతో పాటు గవర్నర్ కోసం ప్రత్యేకంగా ఒక గ్రీన్ రూం సిద్ధం చేస్తున్నారు. గవర్నర్‌తోపాటు ఇతర అధికారులు ధరించే ప్రత్యేకమైన స్నాతకోత్సవ వస్త్రాలు ఇప్పటికే సిద్ధం చేశారు. సభావేదిక, ప్రాంగణంలో భారీ శీతలీకరణ యంత్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు.

2500 మంది వీక్షించేలా ఏర్పాట్లు

స్నాతకోత్సవ మందిరంలో జరిగే కార్యక్రమాన్ని దాదాపు 2500 మంది ప్రత్యక్షంగా వీక్షిస్తారు. దీనికి అనుగుణంగా సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా డాక్టరేట్ తీసుకునే వారితో పాటు ఒకరిని అనుమతిస్తారు. ఇప్పటికే వేదిక ఎదురుగా సీటింగ్ ఏర్పాట్లను ప్రారంభించారు. శుక్రవారం మధ్యాహ్నానికి పూర్తిస్థాయిలో వేదికను సిద్ధం చేసే దిశగా సిబ్బంది పనిచేస్తున్నారు. స్నాతకోత్సవ మందిరం చుట్టూ ఉన్న రహదారులకు మరమ్మతులు, కొత్తవి నిర్మించడం పూర్తి చేశారు. పారిశుధ్య సిబ్బంది ఎప్పటిప్పుడు వ్యర్థాలను తొలగించి, తరలిస్తున్నారు.

బంగ్లామెట్టపై 'స్వచ్ఛత పక్వాడా'

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో గురువారం 'స్వచ్ఛత పక్వాడా' నిర్వహించారు. సమగ్ర శిక్ష యంత్రాంగం పర్యవేక్షణలో విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలు పూర్తి చేసినట్టు ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు తెలిపారు. ఆశ వర్కర్ స్వాతి విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. వ్యాస రచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, నాగమణి పాల్గొన్నారు.

రామవరంలో రక్తదానం

ఆనందపురం: మండలంలోని రామవరంలో గురువారం నమ్మి జగదీష్ మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం స్నేహితులు 30 మంది రక్తదానం చేశారు. ఛత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంక్ వైద్య సిబ్బంది నిర్వహించిన శిబిరంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, ఎంపీటీసీ సభ్యుడు గొలగాని కృష్ణ, సర్పంచ్ వై.రాజు, గ్రామపెద్దలు వి.వినోద్‌బాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.



రామవరంలో రక్తదానం చేస్తున్న యువకులు